క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న పల్లా శ్రీనివాస్



పల్లా శ్రీనివాస్‌కు అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదన్ని, జ్ఞాపికను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పెందుర్తి: పద్మనాభపురం స్టేషన్ బంటాకాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బంటాకాలనీ, మేహాద్రిగెడ్డ కాలనీ, అప్పలనర్సయ్యకాలనీ, వెంకటసాయినగర్, రవినగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రాంపురంలో విత్తనాల పంపిణీ



విత్తనాలు అందిస్తున్న రెడ్డి నారాయణరావు

పెందుర్తి: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలను రాంపురంలో బుధవారం రైతులకు పంపిణీ చేశారు. గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు చేతుల మీదుగా వీటిని అందించారు. గ్రామ వ్యవసాయాధికారి ప్రియాంక, నాయకులు కుచ్చు కన్నయ్య, అన్నంరెడ్డి బంగారునాయుడు, అన్నంరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అబ్బురం.. జైపాతాళ భైరవి



జైపాతాళ భైరవి నాటకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం : సురభి నాటకోత్సవాలలో భాగంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఐదో రోజు జైపాతాళ భైరవి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకం ఆద్యంతం ప్రేక్షకులను మైమరిపించింది. రెప్పపాటులో మారుతున్న సెట్టింగ్‌లతో వెండి తెరను మరిపించేలా కళాకారులు తమ ప్రతిభతో ప్రదర్శించి ప్రేక్షకులు హృదయాలను దోచుకున్నారు. రంగసాయి నటక సంఘం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి నేతృత్వంలో ప్రదర్శించిన ఈ నాటకాన్ని రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, మల్లేల రాజేంద్రప్రసాద్, మరపట్ల భాస్కరరావు తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు.

గెడ్డవాగులో ఆక్రమణల తొలగింపు



ఇరువాడ గెడ్డవాగులో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది



గెడ్డవాగులో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

సబ్బవరం: మండలంలోని ఇరువాడ రెవెన్యూ పరిధిలోని గెడ్డవాగులో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. గతంలో జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 106,103లలో సిబ్బంది సర్వే నిర్వహించారు. పలు ఆక్రమణలు జరిగినట్టు గుర్తించారు.సర్వే నెంబర్లు 106,103లలో కోట్లాది రూపాయల విలువచేసే సుమారు 3 ఎకరాల గెడ్డవాగు /పోరంబోకు స్థలాన్ని ఒక రియల్టర్ ఆక్రమించి లే అవుట్ వేసి క్రయ విక్రయాలు చేపడుతున్నాడని అదే గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు అనే వ్యక్తి గత నెల 24న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.అనంతరం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ వెంకట్,ఆర్ఐ వీరయ్య,సర్వేయర్ శ్రీనివాసరావు మిగిలిన సిబ్బందితో కలిసి గెడ్డవాగును పరిశీలించి సర్వే నిర్వహించారు.అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి నుంచి ప్రైవేటు లే అవుట్‌కు వెళ్లేందుకు 23 సెంట్లు సర్వే నెంబర్ 106లో ఉందని గుర్తించినట్లు సర్వేయర్ శ్రీనివాసరావు తెలిపారు. ఎంత వరకూ ఆక్రమణకు గురైందని సర్వే పూర్తి చేసి గురువారం వెల్లడిస్తామని చెప్పారు.

దాహార్తి తీర్చేందుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: రావాడ శివారు గొల్లగుంట గ్రామ ప్రజల దాహార్తిని తీర్చడానికి చర్యలు తీసుకొంటామని సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు చెప్పారు. 'గొల్లగుంటలో తాగు నీటికి కటకట' శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి సర్పంచ్ ఎం.ఎస్.నాయుడు, పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మోటారు రిపేర్లకు నోచుకోవడంతో కొంత కాలం నుంచి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఎట్టకేలకు సమస్యను గుర్తించిన సర్పంచ్ ఎం.ఎస్.నాయుడు, అధికారులు గ్రామాన్ని సందర్శించారు. పాడైపోయిన మోటారు స్థానంలో కొత్త మోటారు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడానికి సన్నాహాలు చేస్తున్నామని సర్పంచ్ ప్రజలకు హామీ ఇచ్చారు. రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. అంతవరకు ట్యాంకరుతో తాగునీటిని సరఫరా చేస్తామని సర్పంచ్ నాయుడు ప్రజలకు భరోసా కల్పించారు.



మోటారు మరమ్మతులను పరిశీలిస్తున్న సర్పంచ్ నాయుడు

కంటి శస్త్ర చికిత్సల్లో శంకర్ ఫౌండేషన్ ప్రగతి

డీజీఎం బంగార్రాజు వెల్లడి



బంగార్రాజు



శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి

సింహాచలం: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అత్యధిక శస్త్రచికిత్సలు చేసి ప్రజల కళ్లల్లో వెలుగులు నింపిందని ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ బంగార్రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నాణ్యమైన కంటి వైద్యలు అందిస్తున్న నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో గడిచిన ఏప్రిల్ నుంచి జూన్ వరకు 8,839 కంటి శస్త్రచికిత్సలు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే 50,555 మంది ఔట్ పేషెంట్లకు సేవలందించడం జరిగిందన్నారు. రెటీనా, రెటీనా ఇంజెక్షన్లు, గ్లకోమా, కార్నియా, పీడియాట్రిక్ కంటి వైద్యం, ఆర్బిట్ అక్యూలో ప్లాస్టీ విభాగాల్లో మంచి ప్రగతి సాధించిందన్నారు. సామాజిక కంటి వైద్య సేవల్లో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో 130 ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు 3,265మందికి కంటి శస్త్రచికిత్సలు చేసి వారి గమ్యస్థానాలకు ఉచితంగా చేరవేయడం జరిగిందన్నారు. అద్భుతంగా సేవలందించిన వైద్యులు, సిబ్బందిని శంకర్ ఫౌండేషన్ ట్రస్టీస్ ఆత్మకూరు కృష్ణకుమార్, ఆత్మకూరు విజయ్‌కుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ అభినందించారు.

125 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సత్యవతి

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర మెడికల్స్ సౌజన్యంతో బుధవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. సుమారు 125 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు.వీరిలో 32 మందికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు.వీరికి శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని కోఆర్డినేటర్ సతీష్ తెలిపారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ మేనేజర్ ఎం. అరుణకుమారి,పాణీ, పణీంద్ర,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు వి.కనకప్పారావు సూచించారు. డయేరియా నివారణ పై గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి కనకప్పారావు మాట్లాడుతూ అతిసార వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పరిసర ప్రాంతాల అపరిశుభ్రత, కలుషిత ఆహారం, కలుషిత నీటి వల్ల వ్యాధి ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆహార పదార్థాలు వేడిగా ఉన్నప్పుడు తీసుకోవాలని సూచించారు. అనారోగ్య సమస్య తలెత్తితే అశ్రద్ధ చేయకుండా వైద్య సేవలు పొందాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు డయేరియా వ్యాధి నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది ఇళ్ల వద్ద నిల్వ చేసిన నీటిని తొలగించారు. కార్యక్రమంలో ఎం.పి.హెచ్.ఎస్. వి.సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఏ వై.సత్యనారాయణ, ఏఎన్ఎంలు భారతి, గోపికాసాయి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

7న వాడచీపురుపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో దివంగత మాసవరపు సన్నిబాబు జ్ఞాపకార్థం ఈ నెల 7న ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్టు గ్రామ ఉప సర్పంచ్ కూండ్రపు సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆ రోజు ఉదయం 8 గంటల కు వైద్య శిబిరం ప్రారంభం అవుతుందని చెప్పారు. శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు ఉచితంగా అందజేస్తారు. బ్లడ్ బ్యాంకు వారు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తారు.

శిబిరానికి వచ్చే రోగులు ఆరోగ్య శ్రీ, ఆధార్ కార్డులతో పాటు పాత మెడికల్ రిపోర్టులు వెంట తీసుకురావాలని సూచించారు. వైద్య శిబిరాన్ని వాడచీపురుపల్లి పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప సర్పంచ్ సత్యనారాయణ కోరారు.

అధికారికి అభినందనలు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖ యూనిట్ నూతన అడిషనల్ జీఎం (హెచ్ఆర్)గా ఎన్.లీల బాధ్యతలు స్వీకరించారు. ఆమె హైదరాబాదు భెల్ యూనిట్ నుంచి బదిలీపై విశాఖ యూనిట్‌కు వచ్చారు. ఆమెను సంస్థ గుర్తింపు యూనియన్ ప్రతినిధులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహు, ప్రతినిధులు కొల్లి దేముడు, పి.వి.ఎన్.రాజు, ప్రతినిధులు ఎ.వెంకటరావు, గెడ్డాడ ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వేపోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది సంయుక్తంగా పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. రాజస్తాన్‌కు చెందిన పరమేశ్వర్‌జాట్, కమలేష్ వైష్ణవ్‌లను, వేరొక కేసులో ఒడిశాలోని కోరాపుట్ జిల్లాకు చెందిన రామేశ్వర్‌నాయక్, ప్రతాప్‌నాయక్‌లను తనిఖీలు చేయగా వీరు చెన్నైకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలుసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2.55 లక్షల విలువైన సుమారు 51 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

డాక్టర్ ప్రసాద్‌కు సిగ్నిఫికెంట్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ప్రసాద్ మారెళ్ల

సీతంపేట: డాక్టర్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన వరల్డ్ కాన్ఫరెన్స్‌లో నగరానికి చెందిన డాక్టర్ ప్రసాద్ మారెళ్ల నేషనల్ సిగ్నిఫికెంట్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో దేశ విదేశాలకు చెందిన సుమారు వెయ్యి మంది వైద్యులు పాల్గొన్నారు. ఇండియాతో పాటు దుబాయ్, ఇటలీ, సింగపూర్ వంటి దేశాల నుంచి రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు. ఆర్థో, కార్డియో, న్యూరో, స్పోర్ట్స్ రిహాబిలిటేషన్ తదితర అంశాలపై వైద్యులకు అవగాహన కల్పించారు. అపోలో కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హన్నా రాజశేఖర్, పీఎఫ్ఐ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.ప్రసాద్ చేతుల మీదుగా డాక్టర్ ప్రసాద్ ఈ అవార్డును అందుకున్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ, ఉచిత వైద్య శిబిరాలు, కరోనా సమయంలో అందించిన వైద్య సేవలు, అవగాహన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని డాక్టర్ ప్రసాద్ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యలపై ప్రజాప్రతినిధులకు వినతులు



పోరాట కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న కమిటీ చైర్మన్ నర్సింగరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణకు సెయిల్‌లో విలీనం, ముడి పదార్థాల లభ్యత తదితర అంశాలపై ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ప్రజాప్రతినిధులను కలవనున్నారు. అంబేడ్కర్ కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన పోరాట కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. సాధ్యమైనంత త్వరలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో విశాఖ ఎంపీ భరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌లను కలిసి సమస్యలను వివరించనున్నారు. నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను మర్యాదపూర్వకంగా కలవాలని నిర్ణయించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర ఉక్కు సహాయమంత్రి బి. శ్రీనివాసవర్మ, విశాఖ నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబులను కలవనున్నారు. ఈ సందర్భంగా హైకోర్టులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వేసిన కేసు వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు సీహెచ్. నర్సింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్.రావు, యు.రామస్వామి, వై.టి.దాస్, వై.మస్తానప్ప, బి.డేవిడ్, పరంధామయ్య, సన్యాసిరావు, వరసాల శ్రీనివాసరావు, రామ్మోహన్‌కుమార్, నమ్మి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట చర్యలతోనే వ్యాధుల నివారణ



జిల్లా అధికారులకు సూచనలిస్తున్న స్టేట్ మలేరియా డిప్యూటీ డైరెక్టర్ రామనాథం

డాబాగార్డెన్స్: రానున్న వర్షాకాలంలో డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్టేట్ మలేరియా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథం జిల్లా అధికారులను ఆదేశించారు. నగరంలో డెంగ్యూ ప్రభావిత ప్రాంతాలైన జబ్బరితోట, రంగిరీజు వీధి ప్రాంతాల్లో బుధవారం ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించారు. డెంగ్యూ జ్వర బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. డెంగ్యూ జ్వరాలను వ్యాప్తి చేసే ఈడిస్ దోమల నియంత్రణకు చేపడుతున్న యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్, స్ప్రేయింగ్, చికిత్స, అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఉత్తరాంధ్ర జిల్లాల మలేరియా విభాగం అధికారులతో సమావేశమయ్యారు. డెంగ్యూ జ్వరాలను అదుపు చేయడానికి చేపట్టాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా మలేరియా విభాగం అధికారి తులసీరాజ్, జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, ఎంపీహెచ్‌ఈవో శేషుబాబు, ఇతర మలేరియా విభాగం సిబ్బంది, జీవీఎంసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సుప్రసిద్ధ రచయిత బలివాడ

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కవి సమ్మేళనంలో వైవిధ్యభరితమైన కవితలు చదివి అందరినీ అలరించారు. రచయిత బలివాడ కాంతారావు జయంతి సందర్భంగా డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ తెలుగు నవల, కథా సాహిత్య చరిత్రలో తనకంటూ ప్రత్యేకమైన అధ్యాయాన్ని సృష్టించుకున్న సుప్రసిద్ధ రచయిత బలివాడ కాంతారావు అని పేర్కొన్నారు. బాల్యంలోనే స్కూల్ మ్యాగజైన్‌కు సంపాదకుడిగా పని చేసిన ఘనత ఆయనదని తెలిపారు. బలివాడ 38 నవలలు, 400 వరకు కథలు, 5 నాటికలు, మరెన్నో రేడియో నాటికలు రాశారన్నారు. నిజాయితీ, నిక్కచ్చితనం, జాలి, దయ, కరుణ ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపించేవని చెప్పారు.

ఆధ్యాత్మిక వైభవం

జగన్నాథ స్వామి రథోత్సవాలు అంగరంగ వైభవంగా నేడు ప్రారంభం కానున్నాయి. టౌన్ కొత్త రోడ్డులో వెలసిన జగన్నాథ స్వామి వారి రథయాత్రకు నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. స్వామి వారి రథోత్సవంలో భాగంగా రోజుకొక అవతారంలో స్వామి భక్తులకు దర్శనం ఇస్తారు. ఆ రూపాలను వీక్షించి భక్తులు తరించిపోతారు.

- నేటి నుంచి జగన్నాథుని రథోత్సవాలు
- ప్రతిష్ఠా ప్రారంభ సంకల్పం నేడు
- 5వ తేదీ రాత్రి విశేష హోమాలు
- 6న పూర్ణాహుతి, నేత్రోత్సవం, సుభద్రాదేవి శాంతి కల్యాణం
- 7న తొలి రథయాత్ర
- 8 నుంచి స్వామి దశావతారాలు
- 18న తిరుగు రథయాత్ర

డాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం ఈ నెల 4 నుంచి 19 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 4 గురువారం జ్యేష్ఠ బహుళ చతుర్దశి సాయంత్రం ప్రతిష్ఠాపన సంకల్పం, 5న అమావాస్య ఉదయం జలాధివాసం, క్షీరాధివాసం, రాత్రి విశేష హోమాలు, పంచ శయ్యాదివాసాలు, 6న ఆషాడ శుద్ధ పాడ్యమి ఉదయం పూర్ణాహుతి నేత్రోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణం, సుభద్రాదేవి శాంతి కల్యాణం జరపనున్నారు. 7 ఉదయం 9.20 గంటలకు స్వామిని రథం పైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 4.15 గంటలకు జగన్నాథ స్వామి తొలి రథయాత్ర ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 8 నుంచి 17వ తేదీ వరకు టర్నర్ చౌల్ట్రీలో గల కల్యాణ మండపంలో దశావతారాల్లో స్వామి భక్తులకు దర్శనమిస్తారు.




జగన్నాథ, సుభద్ర, బలభద్రస్వామి

స్వామి అవతారాలు..

8న మత్స్యావతారం, 9న కూర్మావతారం, 10న వరాహావతారం, 11,12న నృసింహావతారం, 13న వామనావతారం, 14న పరశురామావతారం, 15న శ్రీరామావతారం, 16న బలరామ.. శ్రీకృష్ణావతారం, 17న తొలి ఏకాదశి, శేష పాన్పు అవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

తిరుగు రథయాత్ర..

18 ఉదయం 9.15 గంటలకు స్వామిని రథం పైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 5.10 గంటలకు టర్నర్ చౌల్ట్రీ నుంచి మేళతాళాలు, బాణసంచా, మంగళ వాయిద్యాల నడుమ జగన్నాథుని నామ స్మరణతో వేద పండితుల పారాయణలతో అత్యంత వైభవంగా తిరుగు రథయాత్ర నిర్వహించనున్నారు. 19 ఉదయం సంప్రోక్షణ, పీఠారోహణం అనంతరం స్వామిని యథాస్థానంలో అధిష్ఠింపజేస్తారు.



రథయాత్రకు సిద్ధంగా ఉన్న స్వామి రథం

నిత్య పూజలు..

జూలై 8 నుంచి 17 వరకు నిత్యపూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 వరకు నిత్యపూజ, ఉభయదాతల గోత్రనామాలతో పూజలు, 7 నుంచి 9.30 గంటల వరకు జగన్నాథ స్వామి ప్రార్థనా గాన సంఘంచే ప్రార్థనా తరంగిణి, 9.30 నుంచి 10.30 వరకు లలితా సహస్రనామ పారాయణ, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్ర నామ పారాయణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 9 రోజుల పాటు పాల్గొనాలనుకునే భక్తులు దేవస్థానం కార్యాలయంలో రూ.500 చెల్లించినచో గోత్ర నామాలతో ఆయా రోజుల్లో పూజ జరిపించనున్నారు. దశావతార అలంకరణలు చేయాలనుకునే భక్తులు ముందుగా ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డిని కార్యాలయంలో సంప్రదించవచ్చు.

నాగుపాము కలకలం



డాల్ఫిన్‌నోస్ నేవల్ గృహాల వద్ద పట్టుకున్న నాగుపాముతో స్నేక్ క్యాచర్ నాగరాజు

సింధియా: డాల్ఫిన్‌నోస్ నేవల్ ఏరియాలోని నేవీ సిబ్బంది గృహ సముదాయాల వద్ద 9 అడుగుల నాగుపాము సంచారం కలకలం సృష్టించింది. ఆ ప్రాంతంలోని రోడ్డుపై తిరుగుతూ గోడ రంధ్రంలో దూరడంతో అక్కడి సిబ్బంది చూసి పాములు పట్టే నేర్పరి నాగరాజుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే నాగరాజు అక్కడికి చేరుకుని నాగుపామును పట్టుకుని నిర్మానుష్యమైన ప్రదేశంలో విడిచిపెట్టాడు. విషసర్పం కావడంతో ఎవరికి ఏ ప్రమాదం జరగకపోవడం అక్కడి వారు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో తరచూ పాముల సంచారం కనిపిస్తోందని, వర్షా కాలంలో మరింత అధికంగా ఉంటుందని, తగు నియంత్రణ చర్యలు చేపడతామని నేవీ అధికారులు తెలిపారు.